## ఫుట్‌పాత్ వ్యాపారులకు అండగా ఉంటా

– ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: ఫుట్‌పాత్ వ్యాపారుల ఉపాధికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా అండగా ఉంటానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హామీనిచ్చారు. శుక్రవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సికింద్రాబాద్ కోర్టు వద్ద నోటరీ, టైపిస్ట్, స్టాంప్ వెండర్లు కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఎన్నో సంవత్సరాల నుంచి కోర్టు పరిసరాల్లో ఫుట్‌పాత్‌లపై ఇదే వృత్తి చేసుకుని జీవనం సాగిస్తున్నామని తెలిపారు. కానీ మూడు రోజుల్లో ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయాలని ట్రాఫిక్ పోలీసు అధికారులు నోటీసులు ఇచ్చారన్నారు. ఇప్పుడు ఖాళీ చేయాలంటే తాము ఉపాధిని కోల్పోయి తమ కుటుంబాలు వీధిన పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ఉపాధికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూస్తానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ప్రసాద్‌రావు, కృష్ణ, వనిత, ప్రవీణ్‌కుమార్, వినోద్, సత్యనారాయణ, మదన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరం



ఉచిత వైద్య శిబిరంలో రోగులకు మందులను పంపిణీ చేస్తున్న దృశ్యం

రసూల్‌పురా: రసూల్‌పురా కేఎస్ఎస్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జెమ్‌కేర్ పాలోమి హస్పిటల్, మాక్స్ విజన్ ఐ హస్పిటల్ సహకారంతో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కంటి, దంత, బీపీ, దయాబెటిక్, ఆర్తో, ఆప్తో మెట్రిస్ట్ వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు చేయించుకున్న పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి షేక్ నయిం తదితరులు పాల్గొన్నారు.

## మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

రసూల్‌పురా: బడ్జెట్‌లో పేద, మధ్యతరగతి, వేతన జీవులకు పెద్దపీట వేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం పేదల పక్షపాతి అని మరోసారి నిరూపించుకున్నారని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు జే. రామకృష్ణ అన్నారు. బీజేపీ కంటోన్మెంట్ నియోజకవర్గ నాయకుల ఆధ్వర్యంలో కార్ఖాన అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ 12లక్షల వార్షిక ఆదాయం వరకు ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేకుండా పన్ను స్లాబ్‌ను పెంచారన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ వంశ తిలక్, మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బీఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు



మాట్లాడుతున్న డీసీపీ బాలస్వామి

పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లో సుప్రసిద్ధమైన సర్దార్‌పటేల్ కాలేజీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ జె. నర్సయ్య తదితరులు హాజరై ప్రారంభించారు. కళాశాల చైర్మెన్ పి. హరినాథ్‌రెడ్డి, కార్యదర్శి రంగారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ హేమలత, చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన వారికి సన్మానం



ఏఎస్‌ఐగా పదోన్నతి పొందిన వారిని సన్మానిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

సనత్‌నగర్: నార్త్‌జోన్ ట్రాఫిక్–1 పరిధిలో ఏఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన పలువురిని ఏసీపీ శంకర్‌రాజు సన్మానించారు. టి.డేవిడ్‌రాజు (తిరుమలగిరి పోలీస్‌స్టేషన్), ఆర్.సుధాకర్ (మహంకాళి పోలీస్‌స్టేషన్), రవిచందర్ (గోపాలపురం)లను ఆయన అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు వెంకటరాములు, మధుబాబు, ఆర్ఎస్ఐ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అదనపు నిధులు కేటాయించేలా కృషిచేస్తా

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పుర : కంటోన్మెంట్ ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు కేటాయించేలా కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో బోర్డు సీఈఓ మధుకర్‌నాయక్‌తో ఎమ్మెల్యే శుక్రవారం భేటీ అయి పలు అంశాలపై చర్చించారు. కంటోన్మెంట్ ప్రాంతంలోని కాలనీ, బస్తీల్లో డ్రైనేజీ, విద్యుత్ దీపాలు, తాగునీటి సరఫరా, పవర్‌బోర్‌వెల్స్ సమస్యల పరిష్కారంపై సీఈఓతో చర్చించారు. అదే విధంగా తిరుమలగిరి లేక్, రామన్నకుంట చెరువు సుందరీకరణ పనులు విషయంలో నిధులు కోసం రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడుతానని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి చేరుతున్న టీపీటీ చార్జెస్ విషయమై బోర్డు అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖరాస్తే సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి టీపీటీ చార్జీలు బోర్డు ఖజానాలో నేరుగా జమ అయ్యేలా కృషి చేస్తానన్నారు. ఇలా అయితే మడ్‌ఫోర్ట్ హాకీమైదానంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు సమకూరుతాయని అన్నారు. సానుకూలంగా స్పందించిన సీఈఓ మధుకర్ నాయక్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా బోర్డు పరిధిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.



కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్‌తో బేటీ అయిన ఎమ్మెల్యే శ్రీగణేష్

## వేడుకగా వార్షికోత్సవం

సనత్‌నగర్: బేగంపేటలోని దియా స్కూల్ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సుకుమార్, ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మీ, సెంటర్ కో–ఆర్డినేటర్ మోనిఫ్లోరెన్స్, పాల్గొన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

## మేకల మండి ప్రభుత్వ పాఠశాలకు లయన్స్ క్లబ్ వితరణ



కార్పెట్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్ క్రిష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ కార్పెట్‌లను అందజేశారు. సమావేశాల సమయంలో తల్లిదండ్రులు కూర్చోడానికి వీలుగా పాఠశాలకు నూతన కార్పెట్‌లను అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ అధ్యక్షులు శేరిపల్లి గణేష్, సుబ్రమణ్యం, హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బౌద్ధనగర్: డివిజన్‌లోని సెయింట్ ఆల్బన్ స్కూల్ వీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ కంది శైలజ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పకుండా పాటించాలని అధికారులను ఆదేశించారు. ఏఈ లావణ్య, స్థానిక నాయకులు శ్రీకాంత్, రాజేష్, కలీమ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# మూతపడి 14 ఏళ్లు

### శిథిలమైపోతున్న హౌసింగ్ బోర్డు దుకాణాలు

### ఎప్పుడు తెరుస్తారో తెలియని పరిస్థితి



బాగ్‌లింగంపల్లిలో మూతపడ్డ హౌసింగ్‌బోర్డు దుకాణాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బాగ్‌లింగంపల్లిలో తెలంగాణ హౌసింగ్ బోర్డుకు సంబంధించిన 49 దుకాణాలు గత 14ఏళ్లుగా మూతపడి నిర్వహణకు నోచుకోక శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ దుకాణాలను ఎవరికీ కేటాయించకుండా పెండింగ్‌లో పెట్టడంతో కొన్ని దుకాణాలు ఆక్రమణకు గురయ్యాయి. హౌసింగ్ బోర్డు దుకాణాలతో నిత్యం కళకళలాడే బాగ్‌లింగంపల్లి ప్రధాన రహదారి నేడు శిథిల భవనాలతో బోసిపోయినట్లుగా కళావిహీనంగా మారింది.

- దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రెగ్యులర్ చేసే సమయంలో ఆయన మరణానంతరం 2011న ఆకస్మికంగా మూతపడ్డాయి. ఆ తరువాత మంత్రులు, అధికారులు మారడంతో ఈ దుస్థితికి దారి తీసింది. అయితే పెండింగ్ పడిన రెంటల్ ఎనాన్స్‌మెంట్ చెల్లించమని హౌసింగ్‌బోర్డు అధికారులు నోటీసులు జారీ చేయడంతో కొంత మంది దుకాణదారులు అవగాహన లోపంతో కోర్టులో కేసు వేయడం వల్ల సమస్య జటిలమయ్యింది.
- ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డితో పాటు నాటి మంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను పలుమార్లు కలిసినప్పటికి ప్రయోజనం లేకుండా పోయింది. అప్పటి గృహనిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైతం షాపులు మార్కెట్ రేటుతో ఆయా నిర్వాహకులకు ఇవ్వాలని హౌసింగ్ బోర్డు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అయితే ప్రతి దుకాణానికి నోటీసు ఇచ్చే దశలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చాక 2023లో హౌసింగ్ బోర్డును ఆర్ఎన్‌బీలో విలీనం చేశారు. నాటి నుంచి నేటి వరకు షాపుల నిర్వాహకులు ఎంపీలు, ఎమ్మెల్యేల చుట్టూ చక్కర్లు కొడుతూనే ఉన్నారు.
- ప్రతి నెలా హౌసింగ్‌బోర్డుకు అద్దెకింద సుమారు రూ.40వేలకు పైగా ఆదాయం వచ్చేది. అయితే దుకాణాలు మూసివేయడంతో ఇటు ఆదాయం రాక, అటు రిపేర్లు చేయించలేక ఆక్రమణ నుంచి కాపాడుకోలేని దుస్థితిలో హౌసింగ్‌బోర్డు ఉంది. నేటి ప్రజా ప్రభుత్వమైన స్పందించి మార్కెట్ ధరతో దుకాణ దారులకు కేటాయించి వారికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

## రైలు కిందపడి మైనర్ బాలిక ఆత్మహత్య

అడ్డగుట్ట : రైలు కిందపడి ఓ మైనర్ బాలిక ఆత్మహత్య చేసుకుంది. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు తెలిపిన మేరకు.. జార్ఖండ్ రాష్ట్రం, గార్వా ప్రాంతానికి చెందిన సద్దాం అన్సారీ భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి సొంతూరు వెళ్లేందుకు గురువారం అర్ధరాత్రి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. రెండవ నెంబర్ గేట్ వద్ద ఉన్న వెయిటింగ్ హాల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. శుక్రవారం తెల్లవారుజామునచూడగా పెద్ద కుమార్తె జుబేదా(15) కనిపించలేదు. దీంతో జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సికింద్రాబాద్–లాలాగూడ రైలు పట్టాల వద్ద ఓ బాలిక మృతదేహాన్ని కనుగొన్నారు. మృతురాలు జుబేదాగా కుటుంబసభ్యులు గుర్తించారు. అనారోగ్యం కారణంగానే ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు.

## గుండెపోటుతో మాజీ వార్డు సభ్యుడు మృతి



లాజరస్ (ఫైల్)

లాలాపేట: మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన మాజీ వార్డు మెంబర్, కాంగ్రెస్ నాయకులు వి. లాజరస్(54) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం లాజరస్ అంత్యక్రియలు నారాయణగూడలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువు కాంగ్రెస్ నాయకులు ఆదం సంతోష్, ఆదం విజయ్‌కుమార్, పలువురు మాణికేశ్వర్ నగర్ నాయకులు తదితరులు లాజరస్ అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

## కార్లకు బ్లాక్‌ఫిల్మ్‌ల తొలగింపు



కార్లకు బ్లాక్ ఫిల్మ్‌లను తొలగిస్తున్న బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య

సనత్‌నగర్: ఎంవీయాక్ట్ నిబంధనలకు విరుద్ధంగా కార్లకు ఏర్పాటు చేసిన బ్లాక్ ఫిల్మ్‌లను బేగంపేట ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం తొలగించారు. బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య ఆధ్వర్యంలో సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బ్లాక్ ఫిల్మ్ ఏర్పాటుచేసిన వాహనాలను ఆపి అక్కడికక్కడే తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. బ్లాక్ ఫిల్మ్ ఏర్పాటుచేసుకోవడం నిబంధనలకు విరుద్ధమనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు.

## మంత్రి దామోదర రాజనరసింహకు సత్కారం

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు కృషి చేసిన మంత్రి దామోదర రాజనరసింహకు ఓయూ విద్యార్థి నేతలు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం మంత్రుల నివాసంలో రాజనరసింహను కలసి పుష్పగుచ్ఛాన్ని అందచేసి శాలువతో సన్మానించి సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థి నేతలు వలిగొండ నరసింహ,బాబు, రాజ్‌కుమార్, ఆదిత్య, నాగరాజు, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

## పాత పద్ధతిలోనే నియామకాలు చేపట్టాలి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల అధ్యాపక ఉద్యోగాలను పాత పద్ధతిలోనే చేపట్టాలని రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.బాలకిష్టారెడ్డికి తెలంగాణ స్టేట్ డాక్టరేట్స్ అసోసియేషన్ (టీజీడీఏ) నాయకులు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. గత ప్రభుత్వం నియమించిన రిక్రూట్‌మెంట్ బోర్డును రద్దు చేసి యూజీసీ నిబంధనల ప్రకారం ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీజీడీఏ వ్యవస్థాపక మాజీ అధ్యక్షులు రమణరావు, అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు తిరుపతి, ధాత్రిక స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తులో విద్యావిధానంలో మార్పులు

ఉస్మానియా యూనివర్సిటీ: రానున్న రోజుల్లో విద్యా విధానంలో మార్పులు వస్తాయని ఓయూ వీసీ ప్రొ.కుమార్ పేర్కొన్నారు. ఈఎంఎంఆర్‌సీ, సీఈసీ ఆధ్వర్యంలో రెండు రోజులు జరిగిన జాతీయ వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ వర్క్‌షాప్‌కు హాజరైన ప్రతినిధులకు సర్టిఫికెట్లను అందచేశారు. కార్యక్రమంలో సీఈసీ డైరెక్టర్ ప్రొ.జగత్ భూషణ్ నడ్డా, ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్ రఘుపతి, మాజీ డైరెక్టర్ ప్రొ.జగదీశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏడీఈ జి.నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. బసంత్‌కాలనీ ఫీడర్ పరిధిలోని బసంత్ కాలనీ, లింగంపల్లి, వ్యాస్ హాస్టల్, వెంకటరమణా థియేటర్, జెయిన్ మందదిర్, కాచిగూడ క్రాస్‌రోడ్స్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

# ప్రభుత్వ నిధులు సొంత ఖాతాలోకి..

సస్పెన్షన్‌లో ఉన్న మార్కెటింగ్ అధికారిపై కేసు



శివకుమార్

రసూల్‌పురా: తిరుమలగిరిలోని పట్టు గూళ్ళ పరిశ్రమకు చెందిన ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన ఆరోపణలపై సస్పెన్షన్‌లో ఉన్న మార్కెటింగ్ అధికారి శివకుమార్‌పై తిరుమలగిరి పీఎస్‌లో కేసు నమోదైంది. తిరుమలగిరి సీఐ నాగరాజు, శుక్రవారం తెలిపిన వివరాల మేరకు తిరుమలగిరి సెరికల్చర్ మార్కెటింగ్ అధికారిగా పని చేసిన హైదర్‌షాకోట్, శాంతి కాలనీకి చెందిన శివకుమార్ 2019 అక్టోబర్ 6 నుంచి 2024 జనవరి 17వరకు సంస్థకు చెందిన 71, 59 లక్షల రూపాయలను తిరుమలగిరి యూబీఐ బ్యాంక్ బ్రాంచ్‌లోని తనసొంత ఖాతాలోకి ఆన్‌లైన్ ద్వారా అక్రమంగా దశలవారీగా మళ్ళించుకున్నాడు. శివకుమార్‌పై ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు గతేడాది సస్పెన్షన్ విధించారు. విక్రయాలకు సంబంధించిన నిధుల్లో అవకతవకలు చేసి నిధులను దుర్వినియోగం చేసిన శివకుమార్‌పై అసిస్టెంట్ డైరక్టర్ ఎంఎం. మహిపాల్ ఫిర్యాదు చేయడంతో సీఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం

సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్ గౌడ్

బన్సీలాల్‌పేట్: ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తూ బీజేపీ బలోపేతం దిశగా ముందుకు సాగుతున్నట్లు సికింద్రాబాద్ మహంకాళి జిల్లా నూతన అధ్యక్షులు భరత్ గౌడ్ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ అరుణ్‌జ్యోతి కాలనీలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలపై క్రియాశీలకమైన కార్యక్రమాలను రూపొందించి ముందుకు వెళ్తామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అంతకు ముందు సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం కన్వీనర్ టి. రాజశేఖర్ రెడ్డి నూతన అధ్యక్షులు భరత్‌గౌడ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షులు ఆర్. మహేష్, హరినాథ్ నాయి, ఎస్. రాజు పాల్గొన్నారు.



## ఈఎస్ఐ ఉద్యోగుల ఆందోళన

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న బీమా వైద్య సేవల(ఈఎస్ఐ) ఉద్యోగులు తమ ఆందోళన కొనసాగిస్తున్నారు. ఉద్యోగుల ఆందోళన కార్యక్రమం శుక్రవారం నాటికి 11వ రోజుకు చేరుకుంది. ఈఎస్ఐని ప్రత్యేక కార్పొరేషన్ చేయాలనే నిర్ణయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఉపసంహరించుకోవాలని ఉద్యోగులు, సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. టీఎన్జీవో డీఐఎంఎస్ యూనిట్ వ్యవస్థాపక అధ్యక్షులు వీరన్న గౌడ్ పాల్గొన్నారు.





### ఢిల్లీ పుస్తక ప్రదర్శనలో కోట నీలిమ

## 'విండోస్ ఆఫ్ విదర్భ పుస్తకం'

సనత్‌నగర్: వ్యవసాయ రైతుల ఆత్మహత్యలు, కష్టాల్లో మహిళా వ్యవసాయదారుల జీవన స్థితిగతులను ప్రతిబింబించేలా కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ రచించిన 'విండోస్ ఆఫ్ విదర్భ' పుస్తకం న్యూఢిల్లీలోని పుస్తక ప్రదర్శనలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ప్రచురించిన ఈ పుస్తకం వ్యవసాయ సంక్షోభం గురించి వాస్తవాలను తెలియజేస్తుంది. న్యూఢిల్లీలోని భరత్ మండపంలో జరిగిన కార్యక్రమంలో నీలిమ మాట్లాడారు. మహిళా వ్యవసాయదారులు దుర్భర స్థితిలో జీవిస్తున్నారన్నారు. ఆ మహిళల దీనగాథలను ఈ పుస్తకం చెబుతుందన్నారు. రైతుల ఆత్మహత్యల కుటుంబాల్లో మహిళా వ్యవసాయదారుల జీవితాన్ని అర్థం చేసుకునే విధానం చాలాముఖ్యమన్నారు.

## గ్రామ పంచాయతీలను గ్రేడ్‌ల వారీగా విభజించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గ్రామ పంచాయతీలను గ్రేడ్‌ల వారీగా విభజించాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్‌లు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం డైరీ, కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మారం జగదీశ్వర్, ముజీబ్‌లు మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎంతో కాలంగా పదోన్నతులకు నోచుకోకుండా ఒకే గ్రేడ్‌లో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు వెంటనే వివిధ గ్రేడ్‌లలో ఉన్న ఖాళీల్లో పదోన్నతులు కల్పించి భర్తీ చేయాలన్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 కన్న ముందు ఉన్న ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం 1994 మాదిరిగా గ్రామ పంచాయతీలను వివిధ అంశాల ఆధారంగా చేసుకోని 12769 గ్రామ పంచాయతీలను జనాభా ప్రతిపదికన పునరుద్ధరించి కేడర్ నిర్ధారణ చేయాలని కోరారు.

- పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు సందిల బలరామ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబర్ 317 వల్ల స్థానికత కోల్పోయి సుదూర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శులను వెంటనే వారి సొంత జిల్లాలకు తీసుకురావాలని కోరారు. 2018 నియామకాల ద్వారా వచ్చిన ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను గ్రేడ్ ఫోర్త్ పంచాయతీ కార్యదర్శులుగా రెగ్యూలర్ చేయాలని కోరారు. ఉపాధి హామీ చట్టం 2005 నందు నిర్దేశించిన విధంగా గ్రామ పంచాయతీకి ఒక క్షేత్ర సహాయకుడిని నియమించి పంచాయతీ కార్యదర్శిపై ఉన్న పనిభారాన్ని తగ్గించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులకు అత్యవసర పరిస్థితి తప్ప నిర్దిష్టమైన పని వేళలు ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం ప్రధాన కార్యదర్శి పి.వెంకటరమణ, అసోసియేట్ అధ్యక్షులు శ్రావణ్‌కుమార్, రంజిత్, సదానందం, ఎండి రఫీక్, కోశాధికారి నిరంజన్, ఉపాధ్యక్షులు కల్పన, రమాదేవి, రిషికాంత్‌గౌడ్, నల్లా రాధాకృష్ణా పాల్గొన్నారు.



## ఆలయంలో ఆభరణాల తయారీకి టెండర్ ఖరారు

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని అంజనేయస్వామి దేవాలయంలో వెండి తొడుగుల తయారీ కోసం ప్రకటించిన టెండర్‌లో సికింద్రాబాద్ జనరల్ బజార్‌కు చెందిన రామకృష్ణ జువెలర్స్ నిర్వాహకుడు సత్యనారాయణ అందరికంటే తక్కువకు టెండర్‌ను దక్కించుకున్నారు. ఆన్‌లైన్‌లో నలుగురు దరఖాస్తు చేసుకోగా శుక్రవారం మధ్యహ్నాం ఒంటి గంటలకు ఆన్‌లైన్ టెండర్ సీల్ ఓపెన్ చేశారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ స్థపతి వల్లీ నాయగం, హైదరాబాద్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ తమ్మినేని శేఖర్, ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఆలయ రెనోవేషన్ కమిటీ చైర్మన్ జానకీసుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం, కమిటీ సభ్యులు, భక్తుల సమక్షంలో సీల్డ్ కవర్లను తెరిచారు. ఈ సందర్భంగా ఆలయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... ఆంజనేయస్వామి దేవాలయం గర్భగుడిలో వెండి మకర తోరణంలో కూడిన మండపం, ద్వారా భాండములు, తలుపులకు వెండి రేకు నగీషీ తొడుగు అమరుస్తారని పేర్కొన్నారు. అదే విధంగా భవానీ శంకర్ స్వామి, భువనేశ్వరి అమ్మవార్లకు గర్భాలయ ద్వారా భాండములు, తలపులకు వెండి రేకు నగిషీ, తొడుగు పనులు చేపడుతున్నట్లు వారు చెప్పారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు జి.పద్మావతి, నిర్మల, శ్యాంకుమార్, సీతారాణి, సుబ్బారావు, గణేష్, బీజేపీ నాయకులు రత్న సాయి చంద్, భక్తులు పాల్గొన్నారు.